సాక్షి మంచిర్యాల

ఆదివారం । 1 । జనవరి । 2023



హాజీపూర్ మండలం చందనాపూర్ గ్రామ శివారులో పొలంలో రైతులు, మహిళా కూలీల సంబరాలు

న్యూస్‌రీల్

పల్లెప్రగతి పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో జిల్లా అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లెప్రగతి పనులపై పంచాయతీ రాజ్ మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు, ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ హన్మంతరావు శనివారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ భవన్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్‌తోపాటు జెడ్పీ సీఈఓ కే.నరేందర్, డీఆర్‌డీఓ బి.శేషాద్రి, డీపీఓ ఫణీందర్‌రావు పాల్గొన్నారు. మంత్రి ఎరబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు వీధులకు సకాలంలో హాజరు కావాలని, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామాల్లోని వైకుంఠ ధామాలకు విద్యుత్, మంచినీటి వసతి, రోడ్డు సౌకర్యం కల్పించి వినియోగంలోకి తేవాలని అన్నారు. గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి వేర్వేరుగా సేకరించిన తడి, పొడి చెత్తను కంపోస్ట్ షెడ్‌లో ఎరువుగా మార్చి మొక్కలకు వినియోగించేలా చూస్తూ పంచాయతీలు ఆదాయం కూడా పొందాలని తెలిపారు. ప్లాస్టిక్, ఇనుము, పొడిచెత్త అమ్మకాలు చేపట్టి కూడా ఆదాయం పొందాలన్నారు. క్రీడాప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని, నర్సరీల్లో మొక్కలను వర్షాకాలం నాటికి సిద్ధం చేయాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ దత్తారావు, డీఎల్‌పీఓ ప్రభాకర్‌రావు, ఎంపీఓలు శ్రీపతి బాపూరావు, అజ్మత్‌అలీ, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, సతీశ్‌కుమార్, సఫ్దర్‌అలీ, శ్రీనివాస్, ప్రసాద్, సతీశ్‌రెడ్డి, అక్తరొద్దీన్, రమేశ్, బీరయ్య పాల్గొన్నారు.

కొత్త ఆశయాలు 2023

Happy New Year

- జిల్లాలో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు
- అంబరాన్నంటిన సంబరాలు

కొత్త సంవత్సరం వచ్చేసింది. వేడుకలు, విందులు, వినోదాలతో యువతీ, యువకులు, ప్రజల సంబరం అంబరాన్నంటింది. కొత్త ఆశయాలు.. లక్ష్యాలు నిర్దేశించుకుంటూ 2023వ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ లక్ష్యాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారి మాటల్లోనే..



మంచిర్యాలలో విద్యార్థినుల సంబరాలు

అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తా



మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో ఇప్పటికే ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తాను. ఈ ప్రాంత ప్రజలు కోరినట్లుగా మంచిర్యాలకు మంజూరైన మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ పనులను పూర్తి చేయడంతోపాటు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి పనులు పూర్తి చేస్తా. మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్ మున్సిపాలిటీల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయడంతోపాటు డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతాను. పడ్తన్‌పల్లి వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభిస్తాం. కడెం కెనాల్ 42వ డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులు, మంచిర్యాల బైపాస్ రోడ్డు పనులు పూర్తి చేస్తాం.

– మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

ప్రజల కష్టాలు తీర్చడానికి కృషి



బెల్లంపల్లి: రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల కోసం కొత్త ఏడాదిలో మరింత పట్టుదలతో సేవ చేయాలని నిర్ణయం తీసుకున్నాను. ప్రజల కష్టాలను సాధ్యమైనంత వరకు తీర్చడానికి ప్రయత్నిస్తాను. ప్రజల్లో ఒకడిగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

– బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

చెన్నూర్ లిఫ్ట్ కానుక



చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2022 వరకు నిధుల మంజూరు చేయించాను. గత 70 ఏళ్లలో జగరని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కొత్త సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో చెన్నూర్ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొని వచ్చి చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు కానుకగా అందజేస్తా. 2023లో చెన్నూర్ లిఫ్ట్ పనులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించడమే నా ముందున్న ముఖ్యమైన ఘట్టం. ఇప్పటికే లిఫ్ట్ సర్వే పూర్తయ్యింది.

– ప్రభుత్వ విప్ బాల్క సుమన్

పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం



మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో ఇప్పటికే టెండర్లు పూర్తి చేసుకున్న పనులతోపాటు పెండింగులో ఉన్న అభివృద్ధి పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం. పట్టణం రూపు రేఖలు మార్చేలా అన్ని జంక్షన్ల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్, పార్కుల అభివృద్ధి, పట్టణం సుందరీకరణ పనులు పూర్తి చేస్తాం.

– ఎన్.బాలకృష్ణ, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



మంచిర్యాల అర్బన్: ఈ ఏడాది జరిగే పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో టాప్-5లో ఉండేలా సమష్టి కృషి చేస్తాం. మౌలిక వసతుల కల్పన, సర్కారు బడుల బాగు కోసం చేపట్టిన మన ఊరు-మనబడి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తాం. కలెక్టర్ భారతి హోళ్లికేరి ఆదేశానుసారం పదో తరగతి విద్యార్థుల కోసం లిటిల్ టీచర్ లీడర్ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి 6 నుంచి పదో తరగతి వరకు కొనసాగిస్తాం.

– డీఈవో వెంకటేశ్వర్లు

ప్రణాళికబద్ధంగా బోధన..



మంచిర్యాలఅర్బన్: గతేడాది ఇంటర్‌లో 83శాతం మేర ఫలితాలు సాధించాం. ఈ ఏడాది జరిగే ఇంటర్‌లో ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు చేపట్టాం. ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభం కానుంది. పరీక్షల అనంతరం స్పెషల్ సమ్మర్ క్యాంపులో ఎలా చదివాలో.. ఏం చేయాలో తర్ఫీదు ఇవ్వనున్నారు.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

సరికొత్త దృక్పథంతో ముందుకు



పాతమంచిర్యాల: సరికొత్త దృక్పథంతో ముందుకెళ్లాలని గ్రామీణాభివృద్ధి శాఖలో ప్రణాళికలు వేసుకున్నాం. మహిళా సాధికారత, ఉపాధి కల్పనే లక్ష్యంగా శ్రద్ధ తీసుకుంటాం. ప్రతీ మహిళా సంఘం సభ్యురాళ్లను లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా నిర్ణయించాం. 2023లో మరో 3 వేల వ్యాపార యూనిట్ల స్థాపనకు మహిళలకు ప్రోత్సాహం అందిస్తాం. 400 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నాం.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో మంచిర్యాల

మెరుగైన సేవలు అందిస్తా



బెల్లంపల్లి: పుర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రజలకు అందుబాటులో ఉండటానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చే ప్రజలతో సభ్యతగా మెలిగి ఇబ్బందులు తీర్చడానికి ప్రాధాన్యత ఇస్తాను.

– బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్

ఆదాయ వనరులపై దృష్టి



నస్పూర్: ట్రేడ్ లైసెన్స్‌ల పెంపు, ఆస్తిపన్ను వసూలు, తదితర ఆదాయ వనరులపై దృష్టి సారించి మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందిస్తాను. హరితహారంలో భాగంగా పట్టణంలో విరివిగా మొక్కలు నాటించి పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చి దిద్దుతాను. పట్టణంలో నూతనంగా ఎఫ్ఎస్‌టీపీ మలశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తాం.

– నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టి.రమేశ్

పంచాయతీల్లో సమూల మార్పులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్‌లు వినియోగంలోకి తీసుకువచ్చేలా చూస్తాం. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత కనిపించేలా అందరి సమన్వయంతో ముందుకు వెళ్తాం. గ్రామ పంచాయతీ అభివృద్ధితోపాటు పాలన పారదర్శకంగా అందేలా చూస్తాం.

– డీపీఓ ఫణీందర్‌రావు

అందని రేషన్ బియ్యం..!

- జిల్లాలో 79.55 శాతమే పంపిణీ
- పండుగకు పిండి వంటలు కష్టమే



నెన్నెల: ఆలస్యంగా వచ్చిన బియ్యం లోడు

మంచిర్యాలటౌన్/నెన్నెల: జిల్లాలో రేషన్‌కార్డు లబ్ధిదారులకు డిసెంబర్ నెల రేషన్ బియ్యం పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదు. డిసెంబర్ 6న పంపిణీని ప్రారంభించగా 10నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరఫరా చేసే హమాలీలు కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమ్మె బాట పట్టారు. దీంతో 20వరకు రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా, 30వరకు పొడిగించారు. అనుకున్న స్థాయిలో రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కాలేదు. జిల్లావ్యాప్తంగా 423 రేషన్‌షాపులు ఉండగా, 5,874 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. కానీ 83 శాతం బియ్యాన్ని శుక్రవారం వరకు పంపిణీ చేయగా, అదేరోజు ఆన్‌లైన్ ద్వారా పంపిణీకి చివరి రోజు కావడంతో 79.55 శాతం మంది లబ్ధిదారులు మాత్రమే బియ్యం తీసుకున్నా రు. జిల్లాలో 2,19,101 మంది కార్డుదారులు ఉండగా, 1,74,287 మంది మాత్రమే డిసెంబర్ నెల కోటా బియ్యం తీసుకున్నారు. మిగిలిన వారికి బియ్యం సరఫరా చేయక పోవడం, డిసెంబర్ నెల కోటా ఆన్‌లైన్ ముగిసి పోవడంతో లబ్ధిదారులు నష్టపోయినట్లే. జనవరిలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో పిండి వంటలు చేసుకునే వారు, పండుగకు బియ్యం లేకుండా జరుపుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. కాగా, నెన్నెల మండలం గొల్లపల్లి ఉపసర్పంచ్ నారాయణ శనివారం తహసీల్దార్ భూమేశ్వర్‌కు బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని వినతిపత్రం అందజేశారు.

శిశువుల తారుమారు ఘటనలో ఇద్దరి తొలగింపు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనర ల్ ఆసుపత్రిలో ఇద్దరు శిశువులు తారుమారయ్యారనే ఘటనలో ఇద్దరు సిబ్బందిని తొలగించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చందర్ తెలిపారు. స్టాఫ్‌నర్సు, ఆయమ్మ ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు.

మహిళా భవన్‌ల నిర్మాణానికి నిధుల కేటాయింపు

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలోని 102 గ్రామ పంచాయతీల్లో సమ్మక్క, సారలమ్మ భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.5.50 కోట్లు కేటాయించిందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ తెలిపారు. మహిళలు స్వశక్తితో ఎదుగాలనే ఉద్దేశంతో మహిళా భవన్ నిర్మాణాలు చేపడుతోందని పేర్కొన్నారు. నియోజకరవ్గంలోని ఐదు మండలాల్లో 58 భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఒక్కో భవనాన్ని రూ.18 లక్షలతో విశాలంగా నిర్మిస్తామని చెప్పారు. మహిళా సంఘాల సమావేశాలతోపాటు గ్రామాల్లో జరిగే శుభకార్యాలకు భవన్‌లు ఉపయోగపడుతాయని తెలిపారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు

బెల్లంపల్లిరూరల్: వాహనదారులు మద్యం సే వించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లిరూరల్ సీఐ కోట బాబురావు అన్నారు. శనివారం రాత్రి తాళ్లగురిజాల పో లీసుస్టేషన్ పరిధిలోని లంబాడతండా గ్రామ ప్రధాన రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనదారులను ఆపి ధ్రువీకరణ ప త్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి రోడ్ల పైకి రావద్దని, వేడుకలను శాంతి యుత వాతావరణంలో జరుపుకోవాలని సూ చించారు. తనిఖీల్లో తాళ్లగురిజాల ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీల క్రికెట్ టోర్నీ విజేత బెల్లంపల్లి



బెల్లంపల్లి జట్టుకు బహుమతి ప్రదానం

మంచిర్యాలటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్ ట్రోఫి 2022-23లో భాగంగా శని వారం మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ టోర్నీ పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అడిషనల్ కలెక్టర్ బ్యాటింగ్, బౌలింగ్ చేసి అలరించగా, కమిషనర్లు కెప్టెన్లుగా వ్యవహరించి పోటీలను విజయవంతం చేశారు. బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీల జట్లు ఫైనల్లో తలపడగా, బెల్లంపల్లి జట్టు విజేతగా, నస్పూర్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. మంచిర్యాల చైర్మన్ పెంట రాజయ్య, నస్పూర్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, కమిషనర్లు ఎన్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంచార పశువైద్యశాలలో వైద్యుల పోస్టులకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ సంస్థలో మొబైల్ వెటర్నరీ క్లినిక్(1962-పశు ఆరోగ్య సేవ)లో వైద్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంచార పశు వైద్యశాల వాహనాల ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బి.సామ్రాట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ ఇన్ ఎనిమల్ హస్బెండరీ పాసై ఏడాది అనుభవం ఉన్న వారు అర్హులని, తెలంగాణలోని ఏ జిల్లాలోనైనా పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 2, 3 తేదీల్లో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 108, 102, 1962 అంబులెన్స్ వాహనాల కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ఇతర సమాచారం కోసం 9866541664 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నూతనోత్తేజంతో...

కాల చక్రం గిర్రున తిరిగింది. తీపి, చేదు కలయికగా 2022 చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. రేపటి భవితకు నేడు నూత నోత్సాహాన్ని నింపుతూ స్వాగతం పలుకుతోంది 2023. గత అనుభవాలను పాఠంగా చేసుకుని భావి జీవితాన్ని అందంగా మలుచుకోవడానికి తొలిఅడుగులు వేయటానికి ఎర్ర తివాచీ పరుస్తోంది. కొత్త బంగారు లోకం నీదేనోయి అని స్వాగతం పలుకున్న నూతన సంవత్సరం సందర్భంగా లక్ష్యాలపై యువతీ యువకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...



తప్పులు గుర్తించి.. ఉద్యోగం సాధించి

మంచిర్యాలఅర్బన్: గతేడాది చేసిన తప్పులను సరిదిద్దుకుని నూతన సంవత్సరంలో లక్ష్యాలను అధిగమించేందుకు కష్టపడుతాను. ఉద్యోగం సాధించి నా తల్లిదండ్రుల్లో సంతోషం నింపుతాను. పదో తరగతిలో జీపీఏ సాధించి డిప్లొమా కోర్సు తీసుకుంటాను. ఫ్యాషన్ డిజైనింగ్ చేయటం నా అభిరుచి. – శివాణి , మంచిర్యాల, విద్యార్థిని

నీట్‌లో మంచిమార్కులు సాధిస్తా..

మంచిర్యాలఅర్బన్: గతేడాది కంటే ఈ ఏడాది ఎంతో కీలకం. ఇంటర్మీడియట్ బీపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న. బైపీసీ తర్వాత నీట్ పరీక్ష రాసి అందులో మంచి మార్కులు సాధించాలనకుంటున్న. ఎంతో కష్టమైన సీటు సాధించి తల్లిదండ్రుల్లో సంతోషాన్ని కల్గిస్తాను. రానున్న సంవత్సరం అంతా మంచి జరుగుతుందని ఆశిస్తున్న. – శ్రీజ, బైపీసీ రెండో సంవత్సరం విద్యార్థిని

ఇంకొకరికి సాయం అందిస్తా..

మంచిర్యాలఅర్బన్: కరోనా కారణంగా వెనకబడిన కొన్ని అంశాలను గతేడాది మెరుగుపర్చుకునేందుకు దోహదం పడింది. ఇల్లు, కళాశాలలు కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగపడ్డాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఎంసెట్ పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించటం ముందున్న లక్ష్యం. ఆర్థిక సమస్యలు అడ్డు పడుతున్న వారికి నా వంతు సాయం చేస్తాను. – స్వాతి, విద్యార్థిని

సమయపాలన పాటిస్తూ..

మంచిర్యాలఅర్బన్: రెండో సంవత్సరం ఇంటర్‌లో మంచి మార్కులు సాధించి యూనివర్శిటీలో డిగ్రీ చదువాలనుకుంటున్నాను. బీకాం కంప్యూటర్ తీసుకోవటం.. బ్యాంక్‌లో మేనేజర్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. నాపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ముచేయకుండా కొత్త సంవత్సరంలో సమయపాలన పాటిస్తూ ముందుకు సాగుతాను. – అక్షయ.. ఇంటర్ సెకండియర్

పది జీపీఏ లక్ష్యంగా చదువుతా

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో పది జీపీఏ ఫలితాలు సాధించేందుకు ఇష్టపడి చదువుతాను. గతేడాది చదువులో వెనకబడిపోయి నా తోటి స్నేహితులు.. ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మాటల్లో చెప్పరానిది. ఏకాగ్రతతో చదివి అనుకున్న లక్ష్యాల సాధిస్తాను. క్రమశిక్షణతో నడుచుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకువస్తాను. – శశాంక్, పదోతరగతి విద్యార్థి

రైతులు బాగుండాలి

ఆసిఫాబాద్అర్బన్: రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందనేది నా అభిప్రాయం. రైతులకు పండించిన గిట్టుబాటు ధరలను ప్రభుత్వాలు కల్పించాలి. ఈ సంవత్సరం వర్షాలు అధికంగా కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వాలు అన్ని రకాలుగా ఆదుకోవాలి. 2023లో రైతులకు మంచి జరగాలి. – ఆవదపు ప్రణయ్, ఆసిఫాబాద్

గడిచిన సంవత్సరం తృప్తినిచ్చింది..

ఆసిఫాబాద్అర్బన్: గత సంవత్సరం అనుకున్న లక్ష్యాలన్నీ చేరుకోగలిగాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. ఈ నూతన సంవత్సరంలో సొంత ఊరు ఆసిఫాబాద్‌లో రాజరాజేశ్వరా సేవా సంస్థ ఆధ్వర్యంలో పేదలకు సేవలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న. – మసాదె ప్రసాద్ (చింటు)

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: జిల్లా స్థాయి వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు సమన్వయ కమిటీ ఏర్పాటుకు సంబంధిత జిల్లా అధికారులతో పాటు, అవగాహన కలిగిన ముస్లిం మహిళ సభ్యురాలి కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి పేర్కొన్నారు. జనవరి 5లోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

కలెక్టర్‌కు న్యూఇయర్ శుభాకాంక్షలు


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు

పాతమంచిర్యాల: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ భారతి హోళ్లికేరిని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో నూతన సంవత్సన కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ ఉన్నారు.

దళితులు రాజ్యాధికారం సాధించాలి

నస్పూర్: దళితులు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం సాధించాలని దళిత బహుజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ సందేశ్ యాత్రలో భాగంగా నస్పూర్‌లో పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దళితులకు ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధించడమే తమ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. పెద్దపల్లి ఇన్‌చార్జి రమేశ్‌చంద్ర, బెల్లంపల్లి ఇన్‌చార్జి గంధం శంకర్, అధికార ప్రతినిధి పులి రాజారాం, నాయకులు శ్రీనివాస్, చిప్పరి కరుణాకర్, రమేశ్ పాల్గొన్నారు.